


నరసింహారావుకి నల్ల కళ్ళద్దాలు పెట్టుకోవాలన్న కోరిక కలిగింది. ఆ కోరిక అతనిలో రోజు రోజుకీ బజార్లో ధరల్లా అధికం కాసాగింది.

అసలు కోరిక లేని మనిషంటూ అంటూ ఉండడు కనక మనిషి బద్ధకస్తు
ఉండడనుకుంటాను. కోరిక లేకుండా డుగా తయారవుతాడు. అటువంటి
జీవించడంకూడా కష్టమే. ఏ కోరికా జీవితంలో ఉత్తేజం ఉండదు. ఏదో ఒక కష్టపడాలి. చిట్టచివరకు శ్రమ ఫలితంగా
లేకపోతే దేని కోసమూ ప్రయత్నించడం కోరిక ఉండాలి. దానిని సాధించడం కోసం ఆ కోరిక తీరాలి. అప్పుడే ఆనందం;తృప్తి.

-మల్లిక్

వచ్చేశాను. వెంటనే డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళాను. అతను కొన్ని మందులూ, టానిక్‌లూ రాసి ఇచ్చాడు. వాటికి నలభై రూపాయల వరకూ కావాలి. నెలాఖరు. డబ్బు లెక్కడివి? మన పరమేశం అప్పైనా ఇస్తాడేమోనని వెళుతున్నాను" అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

నరసింహారావు తన దగ్గర నలభై రూపాయ లున్నాయని తండ్రికి చెప్ప బోయాడు గానీ, అతని మాటలు గొంతు లోనే ఆగిపోయాయి. 'ఎవరినో అడిగి తీసుకు వస్తానన్నాడుగా? మరేం ఫరవా లేదులే' అనుకున్నాడు. కాస్సేపటికి శివ రామయ్య ఖాళీ చేతులతో తిరిగి వచ్చాడు.

"'నేనుకూడా నీ లాంటి వాడినే. నెలాఖరున నా దగ్గర మాత్రం డబ్బు లెక్కడనుండి వస్తాయి?' అన్నాడురా."

ఉసూరోమని కుర్చీలో చతికిల బడుతూ అన్నాడు శివరామయ్య.

నరసింహారావు అతని మాటలు విన కుండా ఉన్నాడు.

"ఏమైనా తాకట్టు పెట్టి డబ్బు తీసుకురానిదే లాభం లేదు. 'డాక్టరు ఆ మందులు అత్యవసరంగా తెమ్మన్నాడు" అంటూ నిట్టూర్పు వదిలాడు.

నరసింహారావు ఉలిక్కిపడి తండ్రి ముఖంలోకి చూశాడు. లోపలి నుండి అన్నపూర్ణమ్మ నీరసంగా మూలుగు తూంది. శివరామయ్య ఇంటి దూలాల వైపు తదేకంగా చూస్తున్నాడు. బహుశా దేన్ని తాకట్టు పెడదామా అని ఆలోచిస్తు న్నాడు కాబోలు!

నరసింహారావు చటుక్కున జేబులోంచి నలభై రూపాయలు తీసి తండ్రి చేతిలో పెట్టి చరచరా లోపలి గదిలోనికి వెళ్ళి పోయాడు.

శివరామయ్య తెల్లబోయి కొడుకు వెళ్ళిన దిక్కుకే చూస్తూ ఉండిపోయాడు. ఆయన నరసింహారావు కళ్ళలోని కన్నీటి పొరను మాత్రం గమనించలేదు.

* * *

నరసింహారావులోని ఆత్రత ఎక్కు వయిన కొద్దీ ఆలస్యం అయిపోతుది. కాలేజీకి నల్ల కళ్ళద్దాలు పెట్టుకుని వచ్చే ప్రభాకర్‌ని చూస్తుంటే అతని ఒళ్ళు మండిపోసాగింది.

తను నల్ల కళ్ళద్దాలు ఎలాగయినా కొనాలి! ప్రభాకర్ వాటికంటే మంచివే కొనాలి! కాని, ఎలా? ఎలా?

నరసింహారావు ఎన్నో పథకాలు ఆలో చించాడు. అతనికి ఏమీ తట్టలేదు. చిట్టచివరకు తన పాత క్లాసు పుస్తకాలు అమ్మివేయడానికి నిశ్చయించుకున్నాడు. బజార్లో పాత పుస్తకాల కొట్లు చాలా ఉన్నాయి. అక్కడ పాత పుస్తకాల



దీప కళిక    చిత్రం— ఇ. గోపాలరావు ( పొన్నెకల్లు )

అమ్మకం, కొనుగోలు రెండూ జరుగు తాయి. వాళ్ళు పాత పుస్తకాలు సగం ధరకు కొంటారు. అమ్మడం మాత్రం ముప్పావు ధరకు అమ్ముతారు. నరసింహా రావు తన పి. యు. సి. పుస్తకాలు, బి. ఎ. మొదటి సంవత్సరం పుస్తకాలు తీసుకెళ్ళి పాత పుస్తకాల షాపులో అమ్మేశాడు. దగ్గర దగ్గర ఏభై రూపాయల వరకూ వచ్చాయి.

నరసింహారావు హుషారుగా ఈల వేసుకుంటూ బస్‌స్టాప్ చేరుకున్నాడు. తన ఇంటికి వెళ్ళే బస్సు వచ్చింది. ఒక్క గంతులో బస్సు ఎక్కేశాడు. సిటీబస్సులో ఉన్నంతసేపూ ఊహల్లో తేలిపోయాడు. తనూ, నీరజా పార్కులో . . . తను నీరజ ఒడిలో . . . "నరసింహారావ్, నల్ల కళ్ళద్దాలు పెట్టుకుంటే నువ్వు హిందీ సినిమా హీరోలా ఉన్నావ్. . ." అంటూ తన చేతి వేళ్ళలోంచి తన వేళ్ళు దూర్చి మెత్తగా నొక్కుతుంది. అప్పుడు . . . తనేమో . . .

"సార్! మీరు దిగవలసిన స్టాపు వచ్చేసింది" అంటూ కండక్టర్ భుజం తట్టి చెపితే ఈ లోకంలో పడ్డాడు నరసింహారావు. గబగబా అందర్నీ తోసు కుని బస్సు దిగేశాడు.

బస్సు నరసింహారావు కళ్ళలో దుమ్ము కొట్టి వెళ్ళిపోయింది. ఇంటికి వెళుతూ మధ్య దారిలో ఎందుకనో జేబులో చెయ్యి పెట్టిన నరసింహారావు చేతికి నోట్లు తగలలేదు. ఎవరో అతని జేబు కొట్టే శారు! అతనికి తన జీవితంలో నిరాశకు సరియైన అర్థం మొదటిసారి తెలిసినట్లని పించింది. నరసింహారావు ఎంతో నిస్పృహ చెందాడు. అతనికి ఈ సంఘటనతో వెర్రెత్తిపోయింది. అంతేకాదు, నల్ల కళ్ళద్దాలు కొనాలన్న కోరిక మరింత బలపడిపోయింది.

మనిషి సాధారణంగా తనకు అరుదుగా లభించే వాటిమీదే ఆశలు పెంచు కుంటాడు. తను ఆశించినది దూరమైన కొద్దీ అతని కోరిక విపరీతంగా పెరిగి పోతుంది.

అందుచేతనే నరసింహారావు ఆ పని చేయడానికి పూనుకున్నాడు.

తండ్రి చేతిలోంచి డబ్బు తీసుకునే టప్పుడు అతని చేతులు వణికాయి. బి. ఎ. రెండవ ఏడు పరీక్ష ఫీజు నలభై రూపాయలు ఎక్కువ చేసి శివరామయ్యకు చెప్పాడు నరసింహారావు. ఆయన ఎట్లాగో తంటాలు పడి ఆ డబ్బు తెచ్చి కొడుకు చేతిలో పెట్టాడు.

నరసింహారావు కాలేజీలో పరీక్ష ఫీజు కట్టేసి మిగిలిన నలభై రూపాయలు తీసుకుని అటు నుండి ఆటే బజారులోని కళ్ళద్దాల షాపుకి బయలుదేరాడు. తండ్రి కనక నల్ల కళ్ళద్దాలు తనకు ఎక్కడివని అడిగితే ఎవరో స్నేహితుడు తనకు బహుమతిగా ఇచ్చాడని చెప్పడానికి నిశ్చ యించుకున్నాడు.

షాపులో అడుగు పెట్టగానే అతని లోని ఆత్రత విజృంభించింది. కౌంటరు లోని మనిషి నరసింహారావుకి రకరకాల నల్ల కళ్ళద్దాలు చూపిస్తున్నాడు. వాటిని చూస్తుంటే అతని కళ్ళు చెదిరిపోతు న్నాయి. ఏది కొనాలో, ఏది కొనకూడదో తెలియటం లేదు. నరసింహారావు అన్ని రకాల కళ్ళద్దాలూ పెట్టుకుని అక్కడ ఉన్న అద్దంలో తన ప్రతిబింబం చూసు కుంటున్నాడు. వాటిలో ప్రభాకర్ దగ్గర



మహాబలిపురం

ఫోటో— పి. ఎ. వివేకానందన్ ( మద్రాసు )

ఉన్నవి లాంటివి కూడా ఉన్నాయి. నరసింహారావు అటువంటివే కొందామని వచ్చినా, అంతకంటె మంచివి దొరుకుతాయేమోనని ఇంకా అన్ని రకాలూ చూస్తున్నాడు. వాటన్నింటిలోకీ నరసింహారావుని ఒక రకం కళ్ళద్దాలు చాలా బాగా ఆకర్షించాయి. అవి ప్రభాకర్ దగ్గర ఉన్నవాటి కంటే చాలా అందంగా ఉన్నాయి. నరసింహారావు వాటి ధర అడిగాడు. ఆ షాప్‌వాడు వాటి ధర నలభై అయిదు రూపాయలని చెప్పాడు. తను ఫీజులో మిగిల్చిన నలభై కాకుండా నరసింహారావు దగ్గర పది రూపాయల వరకూ ఉన్నాయి. అవి శివరామయ్య అతని చేతి ఖర్చుకి ఇచ్చాడు.

నరసింహారావు ఇంక ఆలోచించకుండా జేబులోంచి నలభై అయిదు రూపాయలు తీసి అతని కిచ్చి నల్ల కళ్ళద్దాలు తీసుకుని షాపులోంచి బయట పడ్డాడు.

ఆకాశం మొత్తం మేఘాలు కమ్మి వేశాయి. నరసింహారావు విసుగ్గా పైకి చూశాడు. 'నేను కళ్ళద్దాలు పెట్టుకుని దర్జాగా ఎండలో నడవాలని అనుకుంటే పాడు మేఘాలు ఇవొకటి' అనుకున్నాడు. తన చేతిలోని నల్ల కళ్ళద్దాల వంక ఒకసారి ఆప్యాయంగా చూసుకున్నాడు. అతని మనసు తెల్లని మబ్బుతునకలా తేలిపోతూంది. బుర్ర నిండా ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

తను... నీరజ... తన నల్ల కళ్ళద్దాలు... ప్రభాకర్ ఈర్ష్య... తను ప్రవరాఖ్యుడు... అమ్మాయిలందరూ వరూధినులు...

నరసింహారావు గాలిలో తేలిపోతూ నడుస్తున్నాడు. అక్కడ రోడ్డు క్రాస్ చెయ్యవలసి వచ్చింది.

నరసింహారావు రోడ్డు దాటుతున్నాడు. అతని ఊహాలు దాట్లు వేస్తున్నాయి. కళ్ళ ముందు రంగు రంగు కలలు.

కాస్త దూరంలో లారీ వస్తూంది. అందులోని డ్రైవరు నాలుగు కళ్ళముందు కూడా రంగులు తిరుగుతున్నాయి...

ఎరుపు... పచ్చ... పసుపు... రకరకాల రంగులు...

నాగులు | బేవ్‌మని త్రేన్పాడు. క్లీనరు రంగన్నకు పుల్లటి కల్లు వాసన వేసింది. కల్లు తాగిన నాగులు మత్తుగా ఉన్నాడు. నీరజను తలుచుకుంటూ రోడ్డు దాటుతున్న నరసింహారావు మత్తుగా ఉన్నాడు.

నాగులు అంతకు కాస్సేపు ముందు తనకు కల్లు ముంత అందించిన రత్తమ్మ ఒంటి వంపులు తలుచుకుని మరీ మత్తెక్కిపోతున్నాడు.

నరసింహారావు నీరజను తలుచుకుని మైమరిచిపోతున్నాడు.

నాగులు... రత్తమ్మ... నరసింహారావు... నీరజ... రంగులు... కలలు...

అంతే!

నరసింహారావు పెద్ద గావు కేక పెట్టాడు. లారీ కీచుమని పెద్దగా శబ్దం చేస్తూ ఆగింది. నాగులు మత్తు పూర్తిగా వదిలిపోయింది.

నరసింహారావు చేతిలోంచి అంత దూరంలో ఎగిరి పడ్డాయి నల్ల కళ్ళద్దాలు. అవి మాత్రం చెక్కు చెదర లేదు.

*

నరసింహారావు ఆస్పత్రినుండి డిస్ఛార్జి అయ్యాడు.

నరసింహారావు ఇప్పుడు రోజూ నల్ల కళ్ళద్దాలు పెట్టుకుంటున్నాడు... ఎండైనా, నీడైనా అన్ని వేళలా వాటిని ఉపయోగిస్తున్నాడు.

ఎట్లాగయితేనేం? ఇన్నాళ్ళకు అతని కోరిక నెరవేరింది. అవును... నల్ల కళ్ళద్దాలు పెట్టుకోవాలన్న అతని కోరిక నెరవేరింది. కాని, మరో విధంగా నెరవేరింది.

లారీ ప్రమాదంలో అతని కళ్ళ స్థానంలో భయంకరమైన రెండు లోతైన గుంతలు ఏర్పడ్డాయి. వాటిని కప్పడానికి అతను ఇప్పుడు నల్ల కళ్ళద్దాలు పెడుతున్నాడు.

అవును! నరసింహారావు నల్ల కళ్ళద్దాలు పెడుతున్నాడు—ఎండైనా, నీడైనా. ★